సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 15 । అక్టోబర్ । 2025



ఆస్పత్రి పూర్తయ్యేదెప్పుడు?
గత ప్రభుత్వంలో మంజూరైన ఆస్పత్రి పనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక నిలిచిపోయాయి. ఎప్పటికి పూర్తిచేస్తారని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. IIలో ▸



కైకలూరులో ఇసుక దుమారం
నిర్మాణాలకు ఇసుక తోలకం కైకలూరులో పెద్ద దుమారాన్ని రేపుతోంది. తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆరోపిస్తోంది. IIలో ▸



రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఏఎస్సై మృతి
జంగారెడ్డిగూడెం మండలం జల్లేరు వంతెన వద్ద రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఏఎస్సై మృతిచెందారు. దైవదర్శనానికి వచ్చి వెళుతుండగా ఈ ఘటన జరిగింది. IIలో ▸

న్యూస్‌రీల్

ఆర్టీసీ కార్మికుల రిలే దీక్ష



నిరాహార దీక్షలు చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు

తణుకు అర్బన్: కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ తణుకు డిపోలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. యాజమాన్యం కొత్తగా పెట్టిన పని భారం, పెరిగిన రెస్ట్ ఆఫ్ డ్యూటీలు, ఇన్ కమింగ్ టైం, కిలోమీటర్లు తగ్గించాలని, డ్రైవర్ గారపాటి రామారావుపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని, బస్సుల సామర్థ్యాన్ని మెరుగుపరచాలని, డిపోలోని ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. రిలే నిరాహార దీక్షలో తణుకు డిపో డ్రైవర్‌లు డి.రాంబాబు, ఎం.జగన్నాధరాజు, పి.వెంకట నాగసుబ్రమణ్యం, వి.రాంబాబు, జి.రామారావు కూర్చున్నారు. అసోసియేషన్ డిపో సెక్రటరీ బి.సుబ్బారావు, అధ్యక్షుడు ఎస్.ఏసుబాబు, డిపో చైర్మన్ టి.శ్రీనివాసరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్, బహుజన సమాజ్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె



సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఉద్యోగులు

భీమవరం: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం విజ్ఞప్తి చేసింది. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో భీమవరం డివిజన్ అధ్యక్షుడు విప్పర్తి బోసు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డిస్కం అధ్యక్షుడు జె శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని మాటలు చెప్పడమే కానీ ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదని తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ మాదిరిగా సంస్థలను విలీనం చేసి వారికి రూ.46 వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించొద్దని కోరుతూ ఇచ్చిన సమ్మె నోటీసుపై ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించడాన్ని వారు తప్పుపట్టారు. ట్రేడ్ యూనియనస్ స్ట్రగుల్ కమిటీ నాయకత్వంలో ఇప్పటికే సమ్మెకు సిద్ధం చేశామని, పవర్ జేఏసీ కూడా సమ్మె నోటీస్ ఇచ్చిందని వారు పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మిక విద్యుత్ ఉద్యోగ నాయకులు పాండురంగరాజు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో అత్యధిక వర్షపాతం

భీమవరం: జిల్లాలోని పాలకొల్లులో మంగళవారం అత్యధికంగా 109.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భీమవరంలో 42.2, కాళ్లలో 40.4, వీరవాసరంలో 36.8, యలమంచిలిలో 29.2, నరసాపురంలో 14.6, మొగల్తూరులో 18.4, పోడూరులో 20.2, పెనుగొండలో 9.8, ఇరగ వరంలో 10.4, ఆచంటలో 18.6, తాడేపల్లిగూడెంలో 6.6, పెంటపాడులో 6.2, తణుకులో 6.6, అత్తిలిలో 15.4, గణపవరంలో 67.2, ఆకివీడులో 51, ఉండిలో 75.8, పాలకోడేరులో 22.2, పెనుమంట్రలో 18.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

నకిలీపై నిరసనాగ్రహం

నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు హరిస్తున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు చేపట్టారు. కూటమి నేతల ధనదాహానికి ఇంకెన్ని కుటుంబాలు బలికావాలంటూ ధ్వజమెత్తారు. జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, ఆచంట నియోజకవర్గాల్లో మంగళవారం భారీ ఎత్తున నిరసన ర్యాలీలు నిర్వహించారు. నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

- కదంతొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు
- భీమవరం, ఆచంట, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో నిరసనలు
- ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఆందోళన
- నకిలీ మద్యాన్ని అరికట్టాలని అధికారులకు వినతులు



ప్లకార్డు ప్రదర్శిస్తున్న కార్యకర్త

నకిలీ మద్యం సరఫరాను నిలువరించాలని ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

సాక్షి, భీమవరం: నకిలీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు కదంతొక్కారు. నకిలీ మద్యాన్ని ఎరులై పారిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కూటమి నేతల తీరుకు నిరసగా మంగళవారం తాడేపల్లిగూడెం, ఆచంట, భీమవరం నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అమాయకుల ప్రాణాలను హరిస్తున్న నకిలీ మద్యాన్ని అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నినదించారు.

ప్రజల ప్రాణాలు పోతున్నా బాబుకు లెక్కలేదు..

నకిలీ మద్యంతో కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెంలో ఆయన నేతృత్వంలో భారీ ఎత్తున పార్టీ శ్రేణులు, స్థానికులు పార్టీ కార్యాలయం వద్ద నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. నకిలీ మద్యాన్ని అరికట్టాలని, తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ధనార్జనే ప్రాధాన్యం అన్నట్టుగా నకిలీ మద్యం సరఫరా చేసి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నాడని విమర్శించారు. కూటమి పాలనలో నకిలీ మద్యం తయారీ కుటీర పరిశ్రమగా తయారైందని మండిపడ్డారు. నకిలీ మద్యం సేవించి ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది మృతిచెందారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అర్బన్, రూరల్, పెంటపాడు కన్వీనర్లు కొలుకులూరి ధర్మరాజు, జద్దు హరిబాబు, కైకాల శ్రీనివాస్, బూత్ కమిటీల కన్వీనర్ కర్రి భాస్కరరావు, మహిళా కన్వీనర్ బోణం విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ విచారణ చేయించాలి..

రాష్ట్రంలో వెలుగుచూసిన నకిలీ మద్యంపై సీబీఐ విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలని భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చినమిల్లి వెంకటరాయుడు డిమాండ్ చేశారు. ఆయన నేతృత్వంలో భీమవరంలో పార్టీ శ్రేణులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. భీమవరం రూరల్ రాయలం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కల్తీ మద్యాన్ని అరికట్టాలని కోరుతూ ఎక్సైజ్ సీఐ బలరామరాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వెంకటరాయుడు మాట్లాడుతూ నాణ్యత లేని మద్యం సేవించి కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, ఆనారోగ్య సమస్యలతో ఎంతోమంది ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. నకిలీ మద్యం వల్ల రాష్ట్రంలో మరణాలు పెరుగుతున్నా కఠిన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం.. నెపాన్ని ప్రతిపక్ష పార్టీపై నెట్టి చేతులు దులుపుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు, యువజన విభాగం జిల్లా కన్వీనర్ చిగురుపాటి సందీప్, భీమవరం అర్బన్, వీరవాసరం మండల అధ్యక్షులు గాదిరాజు రామరాజు, చవ్వాకుల సత్యనారాయణ, రాష్ట్ర మహిళ కార్యదర్శి పాలవెల్లి మంగ తదితరులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలా నకిలీ మద్యం

చంద్రబాబు పాలనలో నకిలీ మద్యం కుటీర పరిశ్రమగా తయారైందని, దీంతో పేద ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని వైఎస్సార్‌సీపీ అడ్వైజరీ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. నకిలీ మద్యాన్ని వ్యతిరేకిస్తూ తూర్పుపాలెంలోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఆచంట కవేరి సెంటర్‌కు చేరుకుని అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో నకిలీ రాజ్యం నడుస్తోందన్నారు. పేద ప్రజలను వైద్య విద్యకు సైతం దూరం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. డైవర్షన్ రాజకీయాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలో ఇప్పటివరకు 421 మంది నకిలీ మద్యం వల్ల మృతి చెందినట్టు వార్తా పత్రికలు చెబుతున్నాయన్నారు. నకిలీ మద్యంలో టీడీపీ నాయకుల ప్రమేయం ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. చిత్తూరు జిల్లాలో భారీ స్థాయిలో నకిలీ మద్యం పట్టుబడడం దీని తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. దీనిని డైవర్షన్ చేయడం ద్వారా ప్రజలను మభ్యపెట్టాలని చంద్రబాబు చూస్తున్నారని మండిపడ్డారు. నకిలీ మద్యంపై వాస్తవాలు తెలుసుకోవడానికి సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఏడాదిన్నరకే చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోందన్నారు. కూటమి నేతలు తమ సంపదను పెంచుకోవడానికి నకిలీ మద్యాన్ని ఆదాయ వనరుగా చేసుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, ఎంపీపీలు కర్రి వాసురెడ్డి, పూతినీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కల్తీ మద్యం విక్రయాలకు నిరసనగా రాయలం గ్రామం నుంచి ర్యాలీగా వస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చినమిల్లి వెంకటరాయుడు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఆచంటలో జోరువానలో నకిలీ మద్యంపై నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, పార్లమెంటు పరిశీలకుడు మురళీకృష్ణంరాజు, పార్టీ శ్రేణులు

వివాదాస్పద క్యూలైన్ నిర్మాణంపై
విచారణకు ఆదేశం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో అప్రదక్షిణ మార్గంలో దర్శనం క్యూలైన్ల నిర్మాణాలు చేపట్టడం ఆగమశాస్త్ర విరుద్ధమంటూ ఇటీవల ఏలూరుకు చెందిన ఆధ్యాత్మిక వేత్త, హైకోర్టు న్యాయవాది బీకేఎస్ఆర్ అయ్యంగార్ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఆలయ ఈఓ ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తిని విచారణకు ఆదేశించినట్టు దేవదాయ శాఖ అదనపు కమిషనర్ టి.చంద్రకుమార్ సోమవారం తనకు మెమో ద్వారా తెలియజేసినట్టు అయ్యంగార్ తెలిపారు. విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకోవడానికి వివరణాత్మక నివేదికను ఈఓ నుంచి కోరినట్టు అందులో పేర్కొన్నారన్నారు. తాను చేసిన ఫిర్యాదులో అంతరాలయ దర్శనాన్ని పునరుద్ధరించాలని, స్థానాచార్యులను నియమించాలని, స్వామివారికి వినియోగించిన నిర్మాల్య పుష్పాలతో అగరుబత్తీల తయారీ ఆగమ విరుద్ధమని, అంతరాలయ మండపం ఎదురుగా ఆంజనేయస్వామి, గరుడాళ్వార్‌లు చేస్తున్న నమస్కారం శ్రీవారికి కాకుండా భక్తుల పాదాలకు చేస్తున్నట్టుగా ఉందని, కుచ్చుల మెట్టపై ఉత్సవాన్ని, పొన్నచెట్టు వాహన సేవను పునరుద్ధరించాలన్న అంశాలపై సైతం విచారణకు ఈఓను ఆదేశించినట్టు అయ్యంగార్ తెలిపారు. తనకు వ్యక్తిగతంగా ఎవరిపైనా ద్వేషం లేదని, హిందూ ఆలయాల్లో ఆచార సంప్రదాయాలను కాపాడలన్న ఉద్దేశంతోనే ఈ ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. తూతూ మంత్రంగా విచారణ జరిపి, తప్పులను కప్పిపుచ్చాలని చూస్తే మఠాధిపతులతో ఆలయం వద్ద ఆందోళనకు దిగుతానని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని న్యాయవాది అయ్యంగార్ తెలిపారు.



ఆలయంలో వివాదాస్పద క్యూలైన్ ఏర్పాటుకు నిర్మించిన కాంక్రీట్ చప్టా

- రోడ్లన్నీ గుంతలమయం
- చినుకు పడితే చెరువుల్లా రహదారులు
- గుంతలు కనిపించక ప్రమాదాల పాలవుతున్న జనం
- తుక్కుతుక్కవుతున్న వాహనాలు



ఆరేడు ప్రాంతంలో రోడ్డుపై పడిన పెద్ద పెద్ద గుంతలు

ఆదమరిచారో.. అంతే సంగతులు!

ఉండి: అవునండీ.. ఆ రోడ్లపై వెళితే.. అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిందే.. ఆదమరిస్తే అంతే సంగతులు. రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిని గుంతలమయం కావడమే దీనికి కారణం. ఇక చినుకు పడిందంటే.. రోడ్లన్నీ నీటితో నిండి చెరువులుగా మారుతున్నాయి. ఆ నీటిలో గుంతలు కనిపించక ప్రమాదాల పాలవడం ఖాయం. ఈ పరిస్థితి ఉండి నియోజకవర్గంలోని అనేక రహదారుల్లో నెలకొని ఉండటం గమనార్హం. ప్రధానంగా ఉండి మండలంలో జాతీయ రహదారి(165, పీపీ రోడ్డు), ఉండి – గణపవరం రోడ్డు, గరగపర్రు – తాడేపల్లిగూడెం రోడ్డు, కాళ్ళ మండలంలో జువ్వలపాలెం రోడ్డు, ఆకివీడు మండలంలో జాతీయ రహదారితో పాటు పెదకాపవరం రోడ్డు, చినమిల్లిపాడు – సిద్ధాపురం రోడ్డు, కుప్పనపూడి రోడ్డు, ఆకివీడు, ఐ.భీమవరం మీదుగా ఏలూరుపాడు రోడ్డు, కాళ్ళ మండలంలో బోస్ కాలనీ, పాతళమెరక, బొండాడ, కోపల్లె ఇలా మొత్తం అన్ని రోడ్లూ దెబ్బతినడంతో ప్రయాణికులు, వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. ఇక వర్షం వస్తే ఈ రహదారులు మరింత అధ్వానంగా మారిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం మరమ్మతుల పేరుతో కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన పనుల్లో ఏమాత్రం నాణ్యత ఉందో దీనినిబట్టి అర్థం చేసుకోవచ్చు.



ఆరేడు ప్రాంతంలో ప్రమాదభరితంగా రహదారి

మరమ్మతులు చేపట్టాలి



రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. ప్రమాదాలు జరిగితే ప్రాణాలకు గ్యారంటీ లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలి.

– గొంతే హరీష్, వాహనదారుడు, పాందువ్వ

వెంటనే గుంతలు పూడ్చాలి



నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు తిరిగే గణపవరం రోడ్డులో ఇంత పెద్ద గుంతలు పడినా ప్రజాప్రతినిధులు, స్పందించడం లేదు. ఇప్పటికైనా గుంతలను పూడ్చాలి. ప్రమాదాలను నివారించాలి.

– వర్రే పైడియ్య, మాజీ ఎంపీటీసీ, పాములపర్రు



ఉండి సెంటర్ సమీపంలో చెరువును తలపిస్తున్న ఆర్అండ్‌బీ రోడ్డు



గణపవరం రోడ్డులో గోతిలో పడి పాడైపోయిన మినీ వ్యాన్

మహిళపై టీడీపీ సర్పంచ్ దాడి

- గర్భవతిని పొత్తికడుపులో కాళ్లతో తన్నిన వైనం
- న్యాయంచేయాలని కోరుతున్న బాధితురాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళ



మెడపై గాయాలను చూపుతున్న బాధితురాలు ఉమామహేశ్వరిదేవి



ఉమామహేశ్వరిదేవిపై దాడికి దిగేందుకు వస్తున్న టీడీపీ సర్పంచ్

ఇరగవరం: న్యాయం చేయమని కోరిన గర్భిణిపై ఓ టీడీపీ సర్పంచ్ పొత్తికడుపుపై కాలితో తన్ని తీవ్రంగా గాయపరచిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి బాధితురాలు ఆకుల ఉమామహేశ్వరిదేవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యర్రాయిచెర్వు గ్రామానికి చెందిన జుత్తిగ శ్రీనివాస్ అనే వ్యక్తికి తణుకు మండలం కొమరవరం గ్రామంలో నివాసముంటున్న ఉమామహేశ్వరిదేవి స్థలం కొనుగోలు నిమిత్తం రూ.2.50 లక్షల నగదు ఇచ్చారు. ఆ తర్వాత ఆమె తన భర్తతో సంప్రదింపుల అనంతరం స్థలం వద్దని, తమకు డబ్బులు తిరిగి ఇవ్వాలని శ్రీనివాస్‌ను కోరారు. అందుకు అతను సరైన సమాధానం చెప్పకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల వద్ద డబ్బులివ్వాల్సిన మాట వాస్తవమేనని అంగీకరించిన శ్రీనివాస్.. తొలుత లక్ష రూపాయలు ఇచ్చాడు. కొంతకాలం తర్వాత మిగిలిన సొమ్ము ఇస్తానని చెప్పాడు. ఈ సెటిల్‌మెంట్‌లో యర్రాయిచెర్వు టీడీపీ సర్పంచ్ తనది బాధ్యతగా హామీ ఇచ్చారు. హామీ మేరకు అక్టోబరు మొదటి వారంలో డబ్బులు ఇవ్వాల్సి ఉండగా, మంగళవారం ఉదయం బాధితురాలు శ్రీనివాస్‌కు ఫోన్ చేసి డబ్బులు అడిగారు. దీంతో ఆయన దుర్భాషలాడుతూ డబ్బులు ఇవ్వనని, చేతనైనది చేసుకో అని చెప్పడంతో సెటిల్‌మెంట్ చేసిన టీడీపీ యర్రాయిచెర్వు సర్పంచ్ జుత్తిగ వెంకటమహేష్‌రావు ఇంటికి వెళ్లిన బాధితురాలు ఉమామహేశ్వరిదేవి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారిమధ్య వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో సర్పంచ్ ఆమెపై తీవ్రస్థాయిలో దాడికి దిగారు. ఉమామహేశ్వరికి చెయ్యి, మెడ పైన గాయాలు కాగా తాను గర్భవతిగా ఉన్నానని చెప్పినప్పటికీ కడుపుపై తన్నారని కన్నీటిపర్యంతమయ్యారు. ఘటన సమయంలో సర్పంచ్ దాడి చేస్తున్న వైనాన్ని తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న సమయంలో ఫోన్ లాక్కుని పగులగొట్టారని చెప్పారు. దీనిపై ఇరగవరం పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావును వివరణ కోరగా బాధితురాలి ఫిర్యాదు మేరకు సర్పంచ్ వెంకటమహేష్‌రావుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. బాధితురాలు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. టీడీపీ నాయకులే దాడి చేసినప్పటికీ సర్పంచ్ వెంకట మహేష్‌రావు టీడీపీ వ్యక్తి కావడంతో కూటమి నాయకుల ఒత్తిడి మేరకు బాధితురాలిపై కూడా కేసు నమోదు చేసేందుకు పోలీసులు సిద్ధపడినట్టు తెలుస్తోంది.

మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తయ్యేదెప్పుడు?

- గిరిజన ప్రాంత ప్రజలకు అందని ద్రాక్షగా కార్పొరేట్‌ వైద్యం
- ఆస్పత్రి పనులు పూర్తి చేయాలంటున్న ప్రజలు
- వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.12 కోట్లతో జరిగిన పనులు
- పనులవైపు కన్నెత్తి చూడని కూటమి పాలకులు



బుట్టాయగూడెం శివారు పద్మవారిగూడెం సమీపంలో శ్లాబ్‌ స్థాయిలో ఆగిన మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణం



బుట్టాయగూడెం శివారు పద్మవారిగూడెం సమీపంలో ఆస్పత్రి నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన శిలాఫలకం

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీప్రాంతంలోని ప్రజలకు కార్పొరేట్‌ ఆస్పత్రులకు ధీటుగా వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి బుట్టాయగూడెం శివారు పద్మవారిగూడెం సమీపంలో సుమారు రూ. 50 కోట్లతో 146 పడకల మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని మంజూరు చేశారు. గిరిజన ప్రాంత ప్రజలు మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్ళకుండా ఇక్కడే వైద్యసేవలు పొందాలనే లక్ష్యంతో 2020 అక్టోబర్‌ 2 న పనులు ప్రారంభించేందుకు శంకుస్థాపన చేశారు. ఈ నేపథ్యంలో ఫేజ్‌–1లో ఆస్పత్రి భవనం, ఫేజ్‌–2లో స్టాఫ్‌ క్వార్టర్స్‌, ఫేజ్‌ పేషెంట్స్‌ అంటెండెన్స్‌ భవనాలు నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం మొదటి ఫేజ్‌ భవనం శ్లాబ్‌ వరకూ పూర్తయ్యింది. మిగిలిన రెండు ఫేజ్‌లలోని భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ పనులకు సుమారు రూ.12 కోట్లు ఖర్చయినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ముందు వరకూ పనులు జరిగినా తర్వాత అవి నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం తిరిగి పనులు ప్రాంభించకపోవడంతో గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే..

ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే గిరిజన ప్రాంత ప్రజలు ఏలూరు, విజయవాడ, రాజమండ్రికి వైద్యం కోసం పరుగులు తీయాల్సిన పరిస్థితి ఉండదు. ఏజెన్సీ ప్రాంతంలోని ఐదు మండలాలతో పాటు జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లోని ప్రజలు కూడా ఇక్కడ వైద్యం పొందవచ్చు. ఈ ఆస్పత్రి పూర్తయితే జనరల్‌ ఐపీ వార్డ్‌లు 30, పీడియాట్రిక్స్‌ వార్డులు 20, ఎస్‌ఐసీయూ 10, ఆర్థో వార్డులు 30, జనరల్‌ ఐపీ వార్డులు 9తోపాటు మొత్తం 146 పడకలు అందుబాటులో ఉంటాయి. అన్ని రకాల వ్యాధులకు సంబంధించి అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉంటారు.

కన్నెత్తి చూడని కూటమి పాలకులు

గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్మిస్తున్న మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పనులు నిలిచినా వాటిని తిరిగి ప్రారంభించడంలో కూటమి పాలకులు కనీసం పట్టించుకోవడంలేదని గిరిజనులు విమర్శిస్తున్నారు. 15 నెలలుగా ఆ ఆస్పత్రి నిర్మించే రహదారి వైపు ప్రయాణిస్తున్నా కనీసం అటు వైపు కన్నెత్తి చూడటంలేదని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి నిర్మాణం పనులు పూర్తయితే గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని, ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలని అధికారులు కోరుతున్నారు.

రూ.12 కోట్లతో ఆస్పత్రి పనులు



గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో రూ.50 కోట్లతో బుట్టాయగూడెంలో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు రూ.12 కోట్లతో పనులు జరిగాయి. ఆస్పత్రి భవనం శ్లాబ్‌ వరకూ వచ్చింది. స్టాఫ్‌ క్వార్టర్స్‌ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఎన్నికలకు ముందు పనులు నిలిచాయి. కూటమి ప్రభుత్వం ఈ పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుంది.

– తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే, దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

గిరిజనుల పట్ల చిత్తశుద్ధి లేదు



కూటమి ప్రభుత్వానికి గిరిజనుల పట్ల చిత్తశుద్ధి లేదు. మా ప్రాంతంలో ఏటా టైఫాయిడ్‌, మలేరియా, డెంగ్యూ విష జ్వరాలతో బాధపడుతుంటాం. అత్యవసర వైద్యం కోసం బయట ప్రాంతాలకు పరుగులు తీస్తాం. గిరిజనుల బాధలు తీర్చేందుకు జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వివిధ దశల్లో ఉంది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ పనులు పూర్తి చేయడంలో చిత్తశుద్ధి చూపించడంలేదు.

– బన్నే బుచ్చిరాజు, సర్పంచ్‌, నిమ్మలగూడెం, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

పోగొట్టుకున్న బంగారం అప్పగింత



కొయ్యలగూడెం పోలీసు స్టేషన్‌లో బంగారాన్ని అప్పగిస్తున్న ఎస్సై వి.చంద్రశేఖర్‌

కొయ్యలగూడెం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి బంగారం పోగొట్టుకున్న మహిళకు తిరిగి పోలీసులు అందజేశారు. మంగళవారం మువ్వ శ్రీలక్ష్మి జంగారెడ్డిగూడెం బైక్‌పై వెళుతూ ఏడు సవర్ల బంగారు ఆభరణాలు జారవిడుచుకుంది. పోగొట్టుకున్న బ్యాగులో బ్యాంకు పుస్తకాలు, సెల్‌ ఫోను కూడా ఉండడంతో దాని ద్వారా బ్యాగును పోయిన ప్రాంతాన్ని బయ్యన్నగూడెం సమీపంలో ఉన్నట్లుగా గుర్తించి ఆమెకు అందజేశారు.

డ్రెయిన్‌ తవ్వకం పనులు



అర్తమూరులో డ్రైనేజీలు తవ్వకం చేస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

ఉండి: ఉండి మండలం అర్తమూరులో ఎస్సీ కాలనీలో సమస్యల తిష్ట అని ఈ నెల 11న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిలిచిన వర్షపు నీటిని పొక్లెయిన్‌ సాయంతో మళ్లించారు. అవసరమైన ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించి డ్రెయిన్ల తవ్వకం పనులు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గోగులంపాడులో భారీ చోరీ

ముసునూరు: గోగులంపాడులోని ఒక ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఎస్సై ఎం.చిరంజీవి తెలిపిన వివరాలు ప్రకారం.. చింతలవల్లి శివారు గోగులంపాడుకు చెందిన ఎలమంచిలి నళినీ కుమారి, జగదీష్‌ దంపతులు ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి నూజివీడు పట్టణంలోని బంధువుల ఇంటికి వెళ్ళారు. సోమవారం సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువా తెరిచి అందులో దాచి ఉంచిన కాసు బంగారు గొలుసు, 2 వెండి గిన్నెలు, కుంకుమ భరిణె, రూ. 8 వేల నగదు చోరీ చేసినట్లు గమనించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

జేసీబీ సీజ్‌



స్వాధీనం చేసుకున్న జేసీబీ

చాట్రాయి: అక్రమంగా అటవీ భూమిని చదును చేస్తున్న జేసీబీని స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్టు రేంజర్‌ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని చీపురుగూడెం ఫారెస్టులో సోమవారం తెల్లవారుజామున అటవీ భూమిని గుర్తు తెలియని వ్యక్తి జేసీబీతో చదును చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి జేసీబీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మద్దిలో పూజలు



గుర్వాయిగూడెం మద్దిక్షేత్రంలో ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి వారికి అత్యంత ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తర పూజలను, అన్నప్రాసనలు, వాహన పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. భక్తులకు శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాదం అందజేసినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. మధ్యాహ్నం వరకు ఆలయానికి వివిధ సేవల రూపేణా రూ.1,82,316 ఆదాయం వచ్చింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సహాయ కమిషనరు తెలిపారు.

నేడు ఫెన్సింగ్‌ సెలక్షన్స్‌

తణుకు అర్బన్‌: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఫెన్సింగ్‌ టీమ్‌ సెలక్షన్స్‌ బుధవారం అండర్‌–14 విభాగంలో నిర్వహిస్తున్నట్లు ఫెన్సింగ్‌ అసోసియేషన్‌ రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్‌ తెలిపారు. తణుకు స్టెప్పింగ్‌స్టోన్‌ స్కూలులో నిర్వహించే ఈ ఎంపికలకు 2012 జనవరి 1 తరువాత పుట్టిన వారై ఉండాలని వివరించారు. ఈ నెల 18న కాకినాడ లక్ష్య స్కూలులో నిర్వహించే ఏపీ స్టేట్‌ ఇంటర్‌ డిస్ట్రిక్ట్‌ అండర్‌–14 సబ్‌ జూనియర్‌ చాంపియన్‌షిప్‌ 2025–26లో పాల్గొనేందుకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నామని, ఇతర వివరాలకు 9680234566 నెంబరులో సంప్రదించాలని కోరారు.

రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తున్నారు



భీమవరంలో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతున్న శర్మ

భీమవరం: కేంద్ర పాలకులు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని దానివల్ల లౌకికవాదం, ప్రజాస్వామ్యం దెబ్బతింటాయని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్‌ శర్మ ఆవేదన వ్యక్తం చేశారు. భీమవరం లౌకిక వేదిక ఆధ్వర్యంలో మంగళవారం యూటీఎఫ్‌ కార్యాలయంలో నిర్వహించిన లౌకిక సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం దేశ ప్రజలకు అనేక హక్కులను కల్పించిందని సమానత్వాన్ని సాధించాలంటే రిజర్వేషన్లు ఉండాలని ఆయా ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తూ అనేక చట్టాలను రూపొందించిందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగం ప్రసాదించిన అనేక హక్కులను తుంగలో తొక్కుతూ మనువాద రాజ్యమే లక్ష్యంగా పనిచేస్తున్నారని విమర్శించారు. మహనీయులు చేసిన త్యాగాలను గుర్తించకుండా దూషించడం, మతోన్మాద చర్యలకు అడ్డుపడుతున్న వారిపై దాడులు చేయడం రోజురోజుకీ పెరుగుతోందని శర్మ అన్నారు. కార్యక్రమంలో ఉద్దరాజు రామం ఫౌండేషన్‌ చైర్మన్‌ మంతెన సీతారామ్‌, రిటైర్డ్‌ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.జేమ్స్‌ పాల్గొన్నారు.

ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



ఆలయంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ నాగరాణి

పాలకొల్లు సెంట్రల్‌: కార్తీకమాసంలో క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేయాలని కలెక్టర్‌ నాగరాణి అన్నారు. మంగళవారం క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ ఆలయంలో పనితీరు అనుకున్నంత బాగాలేదని ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్లాస్టిక్‌ కవర్లు వాడకుండా బుట్టలను ఏర్పాటుచేయాలన్నారు. ఆలయం బయట అరటిపళ్లు, కొబ్బరికాయలు విక్రయించే షాపుల వారికి చెప్పి బుట్టల్లో పెట్టి స్వామివారి పూజా సామాగ్రి ఇచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్నం 11 గంటల వరకూ ప్రసాదం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులకు సూచించారు. పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో దాశి రాజు, ఎండోమెంట్స్‌ ఏసి సూర్యప్రకాష్‌ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు మెడికల్‌ రిపోర్ట్‌పై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్‌): తనపై కత్తితో దాడి చేసి గాయపర్చినా అది సాధారణ గాయమే అని రిపోర్టు ఇచ్చిన వైద్యుడిపై సమగ్ర విచారణ జరపాలని తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం చీపురుగూడెం గ్రామస్తుడు పలగాని శంకర్‌ మంగళవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 2న తనపై నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంకు చెందిన మారంపూడి వెంకటరత్నం కత్తితో దాడి చేయడం వల్ల తీవ్ర గాయమైందని, అయితే తప్పుడు రిపోర్టు ఇచ్చారని ఆరోపించాడు. తనను కత్తితో నరికిన విషయం రిపోర్టులో లేకపోడం వల్ల దీనిపై విచారణ చేసి న్యాయం చేయాల్సిందిగా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు విజ్ఞప్తి చేశారు.

కైకలూరులో ఇసుక దుమారం

వేధింపులకు గురిచేస్తున్నారు : లారీ అసోషియేషన్‌ నాయకులు



కైకలూరు నియోజకవర్గం చావలిపాడు వద్ద ప్రభుత్వ ఇసుక సరఫరా కేంద్రం



కలిదిండిలో నిలిచిన అధిక లోడుతో వస్తున్న టిప్పరు

కై కలూరు: నిర్మాణాలకు ఇసుక తోలకం కై కలూరులో పెద్ద దుమారాన్ని లేపుతోంది. నియోజకవర్గంలో చావలిపాడు గ్రామంలో ప్రభుత్వ ఇసుక సరఫరా కేంద్రాన్ని ఇటీవల ప్రారంభించారు. ఇక్కడ ఇసుక టన్ను రూ.731కు విక్రయిస్తున్నారు. రవాణా చార్జీలు అదనం. ఇదే ఇసుకను ఇతర ప్రాంతాల రీచ్‌ల నుంచి రవాణా ఖర్చులు కలుపుకుని టన్ను రూ.650 నుంచి రూ.700కే రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ రవాణా కేంద్రం నుంచి వచ్చే ఇసుకకు రవాణా ఖర్చులు రూ.3000 నుంచి రూ.4,000 చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వ ఇసుక సరఫరా నుంచి ఇసుక తీసుకోపోతే గుత్తేదారుల అనుమాయుల సిఫార్సుతో పలు నియోజకవర్గాల్లో అధికారులు ఇబ్బందులు పెడుతోన్నారని లారీ ఓనర్స్‌ అసోషియేషన్‌ ఆరోపిస్తోంది.

కలిదిండి మండలానికి చెందిన ఓ టిప్పర్‌ యజమాని రెండు రోజుల క్రితం ఆచంట ర్యాంప్‌ నుంచి 30 టన్నుల ఇసుకతో సొంత పనులకు ఇసుక తీసుకొస్తున్నాడు. కలిదిండి సెంటర్‌లో ఎస్సై వాహనాన్ని నిలుపుదల చేసి అధిక లోడుతో రావడంతో ఆ ఇసుకను ఏఎంసీ గోడౌన్‌లో దింపించి, వాహనాన్ని వదిలారు. దీంతో సదరు టిప్పర్‌ డ్రైవర్లు అందరూ ప్రభుత్వ స్టాక్‌ పాయింట్‌ నుంచి ఇసుక తీసుకోకుండా బయట నుంచి తీసుకురావడంతో టిప్పర్ల యజమానులను ఇబ్బందులు పెడుతున్నారని భావిస్తోన్నారు.

నిబంధనల అమలులో తారతమ్యం

నియోజకవర్గానికి ఒకటి చొప్పున స్టాక్‌ పాయింట్‌ నిర్వాహణ బాధ్యతను ఏజన్సీకి అప్పగించారు. పోలీసుల నిబంధనల మేరకు 20 టన్నుల ఇసుక మాత్రమే తరలించాలని చెబుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో దాదాపు 200 టిప్పర్లు ఉన్నాయి. వాస్తవానికి యూనిట్ల లెక్కన టిప్పర్ల ఇసుక రవాణా జరుగుతుంది. 6 యూనిట్లు 25 టన్నులు, 8 యూనిట్లు 33 టన్నులు, 10 యూనిట్లు 40 టన్నులు టిప్పర్లతో తీసుకువచ్చే అవకాశం ఉంది. టిప్పర్లను కొనుగోలు చేసినప్పుడే ప్రత్యేకంగా ఇసుక ఎక్కువగా తీసుకురాడడానికి ఎత్తు పెంచుతున్నారు. పోలీసుల నిబంధనలు ప్రభుత్వ ఇసుక రీచ్‌ల వద్ద వాహనాలకు కూడా వర్తింప చేయాలని పలువురు కోరుతున్నారు.

వేధింపులకు గురి చేస్తున్నారు



కై కలూరు నియోజకవర్గానికి వెళ్ళే ఇసుక లారీలు బయట ప్రాంతాల నుంచి లోడ్‌ తీసుకురావద్దని, లోకల్‌గా ఉన్న ఇసుక స్టాక్‌ యార్డు నుంచి తోలుకోవాలని, డైరెక్ట్‌గా చెప్పకుండా ఇబ్బందులకు గురి చేస్తోన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నాం.

– రావూరి రాజా, లారీ ఓనర్స్‌ అసోషియేషన్‌ అధ్యక్షుడు

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్‌ ఏఎస్సై మృతి



రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్‌ ఏఎస్సై నార్లపాటి జగ్గారావు

జంగారెడ్డిగూడెం: దైవదర్శనానికి వచ్చి తిరిగి వెళుతూ రిటైర్డ్‌ ఏఎస్సై జంగారెడ్డిగూడెం మండలం జల్లేరు వంతెన వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఎస్సై షేక్‌ జబీర్‌, మృతుడి కుమారుడి వివరాలు ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలం పేరాయిగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్‌ ఏఎస్సై నార్లపాటి జగ్గారావు (60) మంగళవారం భార్య సరోజినితో ద్విచక్రవాహనంపై మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. దర్శనం అనంతరం స్వగ్రామానికి వెళుతుండగా, జల్లేరు వంతెన వద్ద వాహనాన్ని ఓవర్‌టేక్‌ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. జగ్గారావు తీవ్రంగా గాయపడగా, భార్య సరోజినికి స్వల్ప గాయాలయ్యాయి. మరో ద్విచక్ర వాహన దారుడు పాల వెంకన్నబాబుకు గాయమైంది. క్షతగాత్రులను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో తీవ్రంగా గాయపడిన జగ్గారావు మధ్యలో మృతిచెందారు. మృతుడి కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆయిల్‌ ట్యాంకర్‌ను ఢీకొని ఒకరి మృతి



మృతుడు మహేష్‌రాజు



ప్రమాద సంఘటనలో ట్యాంకర్‌, బుల్లెట్‌ వాహనం

పాలకొల్లు సెంట్రల్‌: పాలకొల్లు నరసాపురం రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం తణుకుకు చెందిన ముగ్గురు యువకులు పేరుపాలెం బీచ్‌కు వెళ్లడానికి బుల్లెట్‌ వాహనంపై బయలుదేరారు. పాలకొల్లు నరసాపురం రోడ్డులో టిడ్కో గృహాల సముదాయం ఎదురుగా వచ్చేసరికి నరసాపురం నుంచి పాలకొల్లు వైపు వస్తున్న ఆయిల్‌ ట్యాంకర్‌ ఈ ద్విచక్ర వాహన్నాఇ ఢీకొట్టడంతో కొల్లి మహేష్‌రాజు (18) అక్కడికక్కడే మృతి చెందాడు. కూచి శరణ్‌ శర్మ, సాయి గణేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సాయి గణేష్‌ను మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించినట్లు వైద్యులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



పండు మృతదేహం

ద్వారకాతిరుమల: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో సోమవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో మండలంలోని దొరసానిపాడుకు చెందిన కర్రి రామచంద్రరావు (పండు) అక్కడికక్కడే మృతి చెందాడు. పండు గతంలో దాబాను నిర్వహించేవాడు. అది మూత పడటంతో ప్రస్తుతం ద్వారకాతిరుమలలో ఒక షాపును అద్దెకు తీసుకుని రెస్టారెంట్‌ నడుపుతున్నాడు. నల్లజర్లలో ఓ వ్యక్తి వద్ద క్యాటరింగ్‌ నగదు తీసుకుని రాత్రి బైక్‌పై స్వగ్రామానికి వెళుతున్నాడు. సర్వీసు రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి వెళుతుండగా, కొవ్వూరు వైపు నుంచి ఏలూరు వైపుకు వెళుతున్న తాడేపల్లిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన పండు అక్కడికక్కడే మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌ మృతి



డ్రైవర్‌ రాజును బయటకు తీసిన స్థానికులు

వీరఘట్టం: ఐషర్‌ వ్యాన్‌లో ఉన్న గోనె సంచులను అన్‌లోడ్‌ చేసేందుకు వ్యాన్‌కు ఉన్న తాళ్లను విప్పుతూ ప్రమాదవశాత్తు వ్యాన్‌ బాడీకి–క్యాబిన్‌కు మధ్యలో పడిపోయిన డ్రైవర్‌ రాజు(35) శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మెయిన్‌ రోడ్డులో మంగళవారం మృతి చెందాడు. ఎస్సై జి.కళాధర్‌, స్థానికులు వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి తాడేపల్లిగూడెంకు చెందిన రాజు గోనె సంచులను తీసుకొచ్చాడు. తాళ్ల విప్పుతూ ప్రమాదవశాత్తు వ్యాన్‌ బాడీకి–క్యాబిన్‌కు మధ్యలో పడిపోయాడు. అక్కడ ఉన్న వారు అతన్ని బయటకు తీశారు. ఇంతలో రాజుకు పిట్స్‌ వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వీరఘట్టం పీహెచ్‌సీకి తీసుకెళ్లగా చనిపోయినట్లు నిర్ధారించారు.

కారు అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

చాట్రాయి: కారు అదుపు తప్పి ఇద్దరిని ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చనుబండలో మంగవారం రాత్రి నరసింహారావుపాలెం రోడ్డు నుంచి అతివేగంతో వచ్చిన కారు స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయం ఎదుట నిలబడిన నాగుల శ్రీను, భీమవరపు మణికంఠను ఢీ కొట్టింది. శ్రీనుకు కాళ్లు విరిగాయి. ఇద్దరినీ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కారు నడిపే వ్యక్తి మద్యం సేవించి వాహనం నడపడంతో ఈ ప్రమాదం జరిగింది. రెండు ద్వి చక్రవాహనాలపైకి దూసుకెళ్లడంతో అవి దెబ్బతిన్నాయి.

ఉరి వేసుకుని యువకుడి మృతి

కామవరపుకోట: ఉరి వేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో ఈస్ట్‌ యడవల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. యడవల్లి గ్రామానికి చోదిమెళ్ళ సురేష్‌, రాధ దంపతుల కుమారుడు అభినాష్‌ ఇంటర్‌ చదువుతూ మధ్యలో ఆపేశాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందగా గమనించిన బంధువులు పోలీసులు సమాచారం అందించారు. ఎస్సై చెన్నారావు సంఘటనా స్థలాన్ని చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

వరకట్న వేధింపులపై ఫిర్యాదు

నూజివీడు: పెళ్లైన ఏడాదికే భర్త, అత్తమామలు వేధిస్తున్నారంటూ వివాహిత పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. పట్టణానికి చెందిన పాన్నాల శ్రీదేవి కి ఒంగోలుకు చెందిన పల్లంశెట్టి సత్యవర్ధన్‌తో 2024లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.10 లక్షల కట్నం, రూ.లక్ష ఆడబిడ్డ కట్నంతో పాటు పెళ్లికి రూ.10 లక్షలు ఖర్చుచేశారు. తన భర్తకు కానిస్టేబుల్‌ ఉద్యోగం వస్తుందంటూ మరో రూ.10 లక్షలు కట్నం తీసుకురావాలంటూ భర్తతో పాటు శ్రీదేవి అత్త దైవేశ్వరి, మామ ఏడుకొండలు కొంతకాలంగా వేధిస్తున్నారు. ఈ విషయమై పెద్ద మనుషుల్లో పెట్టినప్పటికీ ఉపయోగం లేకపోవడంతో బాధితురాలు ఫిర్యాదు చేసింది.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్‌: విద్యార్థిని కనిపించడం లేదంటూ కళాశాల ప్రిన్సిపల్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్‌ హెచ్‌సీ జిలానీ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టి.నర్సాపురం మండలం కేతవరానికి చెందిన బాలిక (18) పెదతాడేపల్లిలోని ఒక ఇంజనీరింగ్‌ కళాశాల హాస్టల్‌లో ఉంటూ సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈ నెల 13న ఉదయం కళాశాలకు వెళ్ళి సాయంత్రానికి తిరిగి రాలేదు. దీంతో బాలిక స్వగ్రామంలో గాలించినా ఆచూకీ కానరాకపోవడంతో మంగళవారం ప్రిన్సిపల్‌ రత్నాకర్‌ రూరల్‌ పోలీసులను ఆశ్రయించారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ ద్వారా భూములు అందించిన వారికి నిర్దేశించిన సమయంలోగా పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌ నుంచి మంగళవారం పోలవరం ప్రాజెక్టు ఆర్‌ అండ్‌ ఆర్‌ పునరావాస కార్యక్రమాలు, జాతీయ రహదారుల నిర్మాణానికి, సెల్‌ఫోన్‌ టవర్ల నిమిత్తం భూసేకరణపై అధికారులతో కలెక్టర్‌ సమీక్షించారు. ఆర్‌ అండ్‌ ఆర్‌ ప్యాకేజీ ఇంకా అవసరమైన భూములకు సంబంధించి భూసేకరణ ప్రకటనలు వెంటనే జారీ చేయాలన్నారు.

క్లుప్తంగా

ఉచిత వైద్య సేవలకు 32 మంది హాజరు



తణుకులో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రమేష్‌చంద్రబాబు

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 32 మంది రోగులు హాజరయ్యారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్ చంద్రబాబు వృద్ధులకు వైద్యసేవలందించారు. బీపీ, సుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి పేద రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులు తీసుకోవాల్సిన ఆహార అలవాట్లు, వ్యాయామం, నడక వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, ఉపాధ్యక్షుడు ద్వారంపూడి బాపిరెడ్డి, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గర్భిణులు తమ రోజు వారీ ఆహారంలో చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, మినుములు, కొర్రలు వంటి వాటిని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో టీవీఎల్.సరస్వతి సూచించారు. పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సరస్వతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పాలు, గుడ్లను తీసుకొని గర్భస్థ శిశువు ఆరోగ్యాన్ని పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఆరోగ్య కార్యకర్త శాంతకుమారి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు గూడెం విద్యార్థులు



జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన గూడెం విద్యార్థులు

తాడేపల్లిగూడెం: జిల్లా క్రికెట్ జట్టుకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ నాగవేణి మంగళవారం తెలిపారు. ఏలూరులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్ -19 విభాగం క్రికెట్ పోటీల్లో జరుగ్గా అత్యంత ప్రతిభ కనపర్చిన గూడెం విద్యార్థులు సుబ్రహ్మణ్యం, మణికంఠ, రెడ్డిలు ఎంపికయ్యారు. వీరికి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మాణిక్యం రాజా, ప్రిన్సిపాల్ నాగవేణిలకు పలువురు అభినందనలు తెలిపారు.

నన్నయ్య ప్రొఫెసర్లకు పురస్కారాలు



ప్రొఫెసర్లను అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: పట్టణంలోని ఆదికవి విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఇద్దరు ప్రొఫెసర్లకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు వచ్చాయి. ఈ విషయాన్ని ప్రాంగణ ప్రిన్సిపాల్ టి.అశోక్ మంగళవారం తెలిపారు. నన్నయ్య ప్రాంగణంలోని కెమిస్ట్రీ ప్యాకల్టీలు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ ఎస్.ప్రశాంతి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్నారు. సోమవారం సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ సంస్థ నుంచి ఈ పురస్కారాలను అందుకున్నట్టు మంగళవారం ప్రిన్సిపాల్ టి.అశోక్ తెలియజేశారు. విశేష కృషి చేసి ఈ పురస్కారాలు అందుకోవడం ద్వారా క్యాంపస్ ఖ్యాతిని ప్రొఫెసర్లు ఇనుమడింపచేశారని అశోక్ అభినందించారు. పలువురు ప్రొఫెసర్లు అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు.

డీఆర్‌జీలో ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

పెంటపాడు: పెంటపాడు డీఆర్‌గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సెలక్షన్‌లు జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల లెఫ్టినెంట్ ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో 19 ఏపీ బెటాలియన్ నుంచి ప్రత్యేక బృందం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేశారు. ఈ ఎంపికలో మొత్తం 64 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో 19 బెటాలియన్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై కన్నెర్ర

- మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు
- రాష్ట్రమంతటా విస్తరిస్తున్న నకిలీ మద్యం
- బెల్ట్ షాపుల ద్వారా పేదల ప్రాణాలతో చెలగాటం
- మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



డిప్యూటీ తహసీల్దార్ పి.అనూరాధకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రాణాలు తీస్తున్న నకిలీ మద్యంపై ప్రజలు కన్నెర్ర చేశారు. వైన్‌షాపులకు అనుబంధంగా బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా విక్రయాలు చేస్తూ రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. నకిలీ మద్యంపై తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా ఏర్పాటయ్యాయన్నారు. ప్రభుత్వానికి ప్రజల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే తక్షణం నకిలీ మద్యం దందాను అరికట్టాలన్నారు. గ్రామాల్లో అశాంతి రాజేస్తున్న బెల్ట్‌షాపులను సమూలంగా నిర్మూలించాలన్నారు. నారా వారి నకిలీ లిక్కర్‌తో రాష్ట్రం నకిలీ మద్యాంధ్రప్రదేశ్‌గా మారిపోయిందన్నారు. కూటమి నేతలు మద్యం దుకాణాలు, బెల్ట్ షాపుల్లో నకిలీ మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నా...అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి చంద్రబాబు మద్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారన్నారు. ఊరూరా బెల్ట్ షాపులకు అనధికార అనుమతిలిచ్చి ప్రజలతో తాగిస్తున్నారన్నారు. తాజాగా నకిలీ లిక్కర్ వ్యవహారంలో నంబర్‌వన్‌గా నిలిచారన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు నిరుపేదల ప్రాణాలు తీస్తున్న నకిలీ మద్యాన్ని పూర్తిగా అరికట్టాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యం దందాలోని ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహిస్తే చంద్రబాబు దుష్ప్రచారం చేశారని, ఇప్పుడు తన అనుచరుల జేబులు నింపే క్రమంలో నకిలీ మద్యం తీసుకొచ్చి..ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబునాయుడు రాష్ట్రంలో మద్యం కుంభకోణం నడుస్తుందని పచ్చమీడియా ద్వారా ప్రజలకు అసత్యాలను చెప్పాడన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అబద్ధాలు, అవాక్కులతో బతుకుతున్నారని దుయ్యబట్టారు. ఒక డెవలప్‌మెంట్ అంటూ కోట్లు రూపాయాలు దోచేస్తున్నారని తెలిపారు. కోట్లాది రూపాయలు దోచేస్తూ దర్జాగా కాలర్ ఎగరేస్తూ మేము శాసనసభ్యులం దోచుకోవడం మాహక్కు , లంచాలు తీసుకోవడం మాకు అలవాటు ప్రజలే తీసుకువచ్చి మాకు ఇచ్చేలా చేశామని నిస్సిగ్గుగా చెబుతున్నారన్నారు. కూటమి అధికారంలో ఉన్న అధినేత చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, లోకేష్ నాయుడు సారథ్యంలో విచ్చలవిడిగా కల్తీమద్యం సరఫరా అవుతుందన్నారు. ప్రజలు ఆరోగ్యంపాడై పోతుందన్నారు. ఇటీవల రాష్ట్రంలో నకిలీ మద్యం తాగి 16 మంది మృతి చెందారన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైపోయిందని, మరో శ్రీలంకలా రాష్ట్రాన్ని మారుస్తున్నాడని చంద్రబాబు అసత్యాలు పలికారన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా సుమారు రూ. 4.42 కోట్లు అప్పు చేస్తే వాటిలో రూ.2.71 కోట్లు ప్రజలకు డీబీటీ ద్వారా సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేసినట్లు సాక్షాత్తు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటు సభల్లో చెప్పారన్నారు. మిగిలిన సొమ్ములను రాష్ట్రంలోని నాన్‌డీబీటీ ద్వారా ప్రజలకు, నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలలు, వైద్యశాలలు, వ్యవసాయరంగానికి, సచివాలయాల ఏర్పాటుకు ఖర్చు చేశారన్నారు. బోణం విజయనిర్మల, ఏలూరి శాంతకుమారి, మందపాటి కుమారి, మరపట్ల విజయలక్ష్మి, డి.లక్ష్మి, డి.బేబిరాణి కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, కైకాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, జడ్డు హరిబాబు, కట్టా నాగరాజు, సిర్రాపు శాంతకుమార్, బొద్దాని శ్రీనివాస్, కసుపూరి భాస్యరాచార్యులు పెంటపాటి సత్యనారాయణ, చామన సూర్యచంద్రరావు, షేక్ నౌషద్, గార్లపాటి వీరకుమార్, బొళెం రమణ, మహ్మద్‌షఫి, తగరంపూడి మురళీకృష్ణ వెలిశెట్టి నరేంద్ర పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి



రీ సర్వేలో గ్రౌండ్ ట్రూతింగ్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం: రీ సర్వేకు రైతులు సహకరించాలని డిప్యూటీ ఇనస్పెక్టర్ ఆఫ్ సర్వే ఇన్‌చార్జ్ రౌతు రామకృష్ణ కోరారు. మంగళవారం గూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలో గ్రౌండ్ ట్రూతింగ్ పనులను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. పెంటపాడు మండలం బి.కొండేపాడు, ఇరగవరం మండలం జి.ఖండ్రిక, రేలంగి గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతులు భూముల వివరాలు రికార్డు చేయడానికి కొత్తగా ఎల్‌పీ నంబర్లు ఇవ్వడానికి, అడంగళ్‌లో పేర్ల మార్పు చేయడానికి సర్వే టీంలు పరిశీలనకు వస్తున్నాయన్నారు. ఈ టీంలకు రైతులు సహకరించాలన్నారు. రైతుల పేర్లు అడంగళ్‌లో లేకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ పనులు సిబ్బంది సరిగా చేస్తున్నారా లేదో చూశారు. టీంలు వస్తున్న సందర్భంలో రైతులు పూర్తి రికార్డులతో హాజరుకావాలన్నారు. రీ సర్వేకు సంబంధించి నోటీసులు వస్తే సచివాలయంలో సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారులకు తెలపాలన్నారు.

వరి పంటపై మూషికాల దాడి

- పెరుగుతున్న పెట్టుబడి ఖర్చు
- బ్రోమోడయోలిన్ మందు సరఫరా చేసిన వ్యవసాయ శాఖ



ఎలుక కొరికిన వరి చేను

పెంటపాడు: నాట్లు వేసినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులు ఆరుగాలం శ్రమిస్తారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టాలను ఎదుర్కొంటారు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొని కర్షకులు వ్యవసాయం చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో మూషికాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నారుమడి దశ నుంచి ఎలుకలు అన్నదాతనే కలవరపెడుతున్నాయి. సామూహికంగా ఎలుకల నిర్మూలనకు ప్రభుత్వం రైతులకు ఉచితంగా బ్రోమోడయోలిన్ మందును సరఫరా చేసింది. దీని వలన ఆశించిన ఫలితాలు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎలుకల నివారణలో రైతులు బిజీ

ప్రస్తుతం చాలా చోట్ల పొలాలు చిరు పొట్ట, ఈనిక దశలో ఉన్నాయి. వరి దుబ్బు తీపి అధికంగా ఉండడంతో ఈ దశలో వరిపై మూషికాల దాడి పెరిగింది. ప్రస్తుతం ఎలుకల నివారణ కోసం బొరియల్లో పొగపెట్టి చంపడం, బుట్టలు పెట్టడం, నివారణకు మందులను వినియోగించడంలో రైతులు బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎలుకలను పట్టుకునే వారికి గిరాకీ పెరిగింది. ఎలుకలు రూ.50 నుంచి రూ.70 వరకు డిమాండ్ చేస్తున్నారు. పెట్టుబడి ఖర్చు అధికమవుతున్న తరుణంలో ఎలుకల నివారణ రైతులకు అదనపు భారమవుతోంది.

అదనపు పెట్టుబడి...

ఇటీవల తుఫాన్ వల్ల నాట్ల సమయంలో పొలాలు దెబ్బతిన్నాయి. నారు దొరకక రైతులు ఇబ్బందులు పడ్డారు. దీని కోసం ఎంతో ఖర్చు పెట్టి నారులు కొనుగోలు చేసి ఎంతో కష్టబడ్డారు. అధనపు వ్యయంగా తోడైంది. మూషికాల దాడి వల్ల ఎలుకలు పట్టేందుకు రూ.ఎలుకకు రూ.50నుంచి రూ.70లు వరకు డిమాండ్ చేస్తున్నారు. దీనితో పాటు ఎరువులు పరుగుల మందులు అదనపు పెట్టుబడితో పాటు ఎలుకల నివారణ కూడా రైతులకు అధనపు భారమవుతుంది. నియోజకవర్గంలో మెట్ట ప్రాంతమైన గూడెం మండలంలో ఈ ఎలుకలు దాడి స్వల్పమైన డెల్టా ప్రాంతమైన పెంటపాడు మండలంలో అధికంగా ఉంది. ప్రధానంగా పెంటపాడు, దర్శిపాడు, కె.పెంటపాడు, పరిమెళ్ల, జట్లపాలెం గ్రామాల్లో ఎలుకల దాడి అధికంగా ఉంది. పంట దిబ్బల కోసం వేసుకున్న మట్టిదిబ్బల ప్రాంతాల్లోనే అధికంగా ఎలుకల బెడద ఉంది. నియోజకవర్గంలో 23వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

నెమ్మదిగా పని చేస్తుంది

బ్రోమోడయోలిన్ మందు ఎలుక శరీరంపై విష ప్రభావాన్ని నెమ్మదిగా చూపుతుంది. ఈ విధానంతో ఎరను తిన్న ఎలుకలు మృతి చెందుతాయి. చేల గట్లపై ఎలుక కన్నాలను గుర్తించి పొగబెట్టి మూసి వేయడం ద్వారా కూడా ఎలుకలను చంపొచ్చు. ఎలుకల ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ఎకరాకు దాదాపుగా నాలుగు నుంచి ఎనిమిది బస్తాల వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



చిరుపొట్ట దశలో ఉండగా ఎలుకల దాడి అధికమవుతోంది. ఈ ఏడాది ఎలుకల ఉధృతి అధికంగా ఉన్న మాట వాస్తవమే. గతంలో ప్రభుత్వం ఎలుకల నివారణ కార్యక్రమం వారం, పది రోజులు నిర్వహించేది. సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించాం. **ఏవో రవికుమార్**

ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలి



ఆరుగొలను సొసైటీ వద్ద రోగులకు మందులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆరుగొలను సొసైటీ త్రిసభ్య కమిటి చైర్మన్ ఉప్పలపాటి వీరవెంకటసత్యనారాయణ కోరారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఆరుగొలను సొసైటీ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యం చేయించుకోవాలంటే భయపడే పరిస్థితి ఉందని, అటువంటి వారికి ఉచిత వైద్య శిబిరాలు ఉపకరిస్తాయన్నారు. పేదల ఇంటి ముంగిటకు వస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం 365 మందికి ఆప్తమాలజీ, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, సైకియాట్రిస్ట్, డెంటల్, రేడియాలజీ, ఎక్స్‌రే, ఈసీజీ వంటి వైద్య పరీక్షలు చేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డి.రాజేంద్రప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపల్ కేవీ.రామారావు, నాయకులు అడపా శ్రీనివాస్, మొసళ్ళ నాని, ప్రభాకర్, వీరమల్లు రాంపండు, అడ్డగర్ల మహేష్, పూరేటి శ్రీరామ్, గోపిరెడ్డి రాము, కూడవల్లి ధనరాజు, కూడవల్లి రాంబాబు, యువీవీ.సేన, సొసైటీ కార్యదర్శి గోపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు దానవరప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం (ఇఫ్టూ) నాయకుడు మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణం శేషమహల్ సెంటర్‌లో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ గత ఏడేళ్లుగా భవన నిర్మాణ కార్మికులకు పరిహారాలు ఇవ్వడం లేదని, సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను గత ప్రభుత్వాలు వేరే పథకాలకు దారి మళ్లించారని విమర్శించారు. కార్మికులకు పక్కా గృహాలు నిర్మించాలని, కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉదయరాజు, కొండా బాబి, అనీస్ బాష, రాంబాబు, నాగేశ్వరరావు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, నవీన్, బుచ్చిబాబు పాల్గొన్నారు.

అధ్వాన దారులు

- పెంటపాడు మండలంలోని రోడ్లు ఛిద్రం
- అవస్థలు పడుతున్న స్థానికులు, ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



కొండేపాడు కనకదుర్గమ్మ ఆలయం వద్ద చెరువును తలపిస్తోన్న ఆర్‌అండ్‌బీ రహదారి

పెంటపాడు: మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వర్షం పడిందంటే ప్రయాణం కష్టంగా మారుతోంది. రోడ్డుపై నీరు నిల్వ ఉండటంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రధానంగా బాదంపూడి నుంచి ప్రత్తిపాడు, పెంటపాడు మండలంలో పలు రహదారులు గతం కన్నా మరింత గుంతలు పడి ఇబ్బందిగా తయారయ్యాయి. గత మూడు నెలల క్రితం ఈ రహదారులపై మరమ్మతులు చేశారు. దీనికి వర్షం తోడైంది. మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. మరో మారు గుంతలు పూడ్చేపనిలో ఉన్నారు. తారు వేయక పోవడంతో ప్రజలు విమర్శిస్తున్నారు. వర్షం వస్తే ఎక్కడ గొతులు ఉన్నాయో, ఎక్కడ లేవో తెలియక వాహనచోదకులకు ప్రమాదాలు బారిన పడుతున్నారు. ఇటీవల ప్రత్తిపాడు- బాదంపూడి మధ్యలో గూడెంలో ప్యాచ్‌వర్కుల చేశారు. కానీ గత వారం రోజుల నుంచి కురిసిన వర్షాలకు వేసిన తారు కొట్టుకు పోయింది. పెంటపాడు నుంచి విప్పర్రు మీదుగా గణపవరం వరకు రోడ్డు వేస్తున్నారు. కాగా ఆ రోడ్డు పూర్తి అవ్వలేదు. పైన కొంచెం పొరగా వేసిన తారు వర్షాకాలం రాకుం డానే తొలగిపోయింది. కొన్ని చోట్ల రాళ్ల పైకి లేచి అధ్వానంగా తయారయ్యాయి. అత్తిలి- అలంపురం రహదారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయి. కానీ ఎన్నికల కోడ్ వల్ల నిర్మాణం జరగలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తాత్కాలికంగా గోతులు పూడ్చింది. అంతకుముందు ఒకసారి గ్రామస్తులు చందాలు వేసుకొని గోతులు పూడ్చుకొన్నారు. అత్తిలి-అలంపురం రోడ్డు కొండేపాడు రోడ్డు అధ్వానంగా ఉంది. రాత్రి సమయాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం రహదారులు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



కొండేపాడు రహదారిలో నిలిచి పోయిన వర్షం నీరు



అలంపురం- అత్తిలి రహదారి కొండేపాడు రైసుమిల్లు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై గోతులు



అలంపురం- రావిపాడు రహదారిలో గుంతలలో వర్షం నీరు

33 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం



తణుకులో గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న డీటీ శ్రీదేవి, ఫైర్ ఆఫీసర్ అజయ్‌కుమార్

తణుకు అర్బన్: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన గృహ వినియోగ రాయితీ గ్యాస్ సిలిండర్లను సివిల్ సప్లై అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పట్టణంలోని జీడిగుంట వారి వీధిలో అరవ ఉదయ భాస్కర రావు ఇంట్లో గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉంచారనే సమాచారంతో సివిల్ సప్లై, ఫైర్ అధికారులు సంయుక్తంగా దాడి చేసి 33 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లై డీటీ శ్రీదేవి తెలిపారు. గ్యాస్ సిలిండర్లను ఇంట్లో ఉంచి బ్లాక్ మార్కెట్లో వీటిని విక్రయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భాస్కరరావుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్, పట్టణ ఏఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

కనకయ్యకు డాక్టరేట్



నామన కనకయ్య

తణుకు అర్బన్: తణుకుకు చెందిన గణిత అధ్యాపకుడు నామన కనకయ్య డాక్టరేట్ పట్టా పొందారు. గణిత శాస్త్ర విభాగంలో «కంట్రిబ్యూషన్ టు సరెటైన్ హయ్యర్ ఆర్డర్ నాన్ హోమోజెనియస్ ఇంటెగ్రల్ బౌండరీ వాల్యూప్రాబ్లమ్స్» అనే అంశంపై డాక్టర్ సంబూరి శ్రీధర్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు సంబంధించి విశాఖపట్నం గీతం యూనివర్శిటీ పీహెచ్‌డీ ప్రధానం చేసినట్లు కనకయ్య తెలిపారు. పలువురు ప్రముఖులు కనకయ్యను అభినందించారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయుసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమసుందర్

తాడేపల్లిగూడెం: ఏఐటీయుసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసనపూడి సోమసుందర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో ఈ నెల 17, 18 తేదీల్లో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరుగనున్నాయన్నారు. గూడెంలో రాష్ట్ర సమితి సమావేశాలు 25 సంవత్సరాల తర్వాత జరుగుతున్నాయన్నారు. కార్యకర్తలు క్రమశిక్షణతో కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర నాయకత్వం రెండు రోజులు పాటు కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన పోరాటాలను రూపొందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా సమితి అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు, ఏఐటీయుసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.